సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం ၊ 16 ၊ మార్చి ၊ 2024



'స్పందన' సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

స్పందనలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ విజయసునీత ఆదేశించారు. 8లో



అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. 8లో



విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాలరాజు



విశాఖ సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాన్ని చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం తెలిపింది.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించాలి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యశాస్త్రి



గంగవరంలో అవగాహన కల్పిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యశాస్త్రి, తదితరులు

గంగవరం : జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.సుబ్రహ్మణ్య శాస్త్రి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈవీఎంలు, ఓటు హక్కు , ఓటింగ్ యంత్ర పరికరాల వినియోగంపై సెక్టోరియల్ ఆఫీసర్లు, బీఎల్వోలకు అవగాహన కల్పించారు. ఓటింగ్ యంత్రం (ఈవీఎం) వినియోగంపై శిక్షణ ఇచ్చారు. అలాగే 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల వినియోగాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రరావు, ఆర్ఐ జిలానీ, సెక్టోరియల్ ఆఫీసర్లు కె.విశ్వనాథ్, సిద్దేశ్వరరావు, ప్రకాశ్, వీరపుదొర, నీతిఆయోగ్ ప్రతినిధి హేమ, వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



కసుమరాయిలో గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

గంగవరం/రంపచోడవరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. శుక్రవారం ఆయన రంపచోడవరం మండలం వాడపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను తెలుసుకున్నారు. అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. గర్భిణులు, ప్రసవాలు, బాలింతల వివరాలను ఆయన తెలుసుకున్నారు. గంగవరం మండలం కుసుమరాయిలో గోకుల పథకంలో నిర్మిస్తున్న పశువుల షెడ్లను పీవో పరిశీలించారు. నాణ్యతతో నిర్మించి త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత ఇంజనీర్లను పీవో ఆదేశించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ టీఈఈ జి. డేవిడ్ రాజ్, డిప్యూటీ ఈఈ నాగరాజు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి షోకాజ్ నోటీసులు



మస్తర్లను పరిశీలిస్తున్న ఉపాధి హామీ ఏపీవో సురేష్‌కుమార్

రాజవొమ్మంగి: ఉపాధి పనులకు రాకపోయినా వచ్చినట్లుగా మస్తర్లు నమోదు కావడంతో ఇరువురు సిబ్బందికి ఏపీవో సురేష్‌కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రాజవొమ్మంగి శివారులో జరుగుతున్న చెరువు పూడిక తీత పనుల్లో 20 శ్రమశక్తి సంఘాలకు చెందిన సుమారు 200 మంది పాల్గొంటున్నారు. శుక్రవారం ఈ పనులను పరిశీలించిన ఏపీవో మస్తర్లను తనిఖీ తనిఖీ చేవారు. సుమారు 50 ఉపాధి వేతనదారులు పనికి హాజరుకాలేదని గుర్తించారు. అయినా వారందరూ పనులకు వచ్చినట్లే మస్తరు షీట్లలో నమోదై ఉండటాన్ని ఆయన గుర్తించారు. సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని ఏపీవో వెల్లడించారు.

● వెన్నుపోటుకే వెన్నుపోటు

ఆ ముగ్గురికీ ఝలక్



వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని తెలిసి కూడా.. నాయకులుగా మలిచి.. చట్టసభలకు పంపించిన పార్టీని వెన్నుపోటు పొడిచి మరీ.. ఆయన పంచన చేరారు. తీరా.. వారి అవసరం లేదని అనుకున్న చంద్రబాబు.. కూరలో కరివేపాకులా పక్కన పెట్టేశారు. విజ్ఞత కలిగిన పార్టీకి దూరమై.. విలువల్లేని పార్టీలో చేరి.. ఇప్పుడు వంచనకు గురయ్యామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ముగ్గురు నేతలు వైఎస్సార్‌సీపీని వంచించి.. టీడీపీలో చేరి.. పాపాలు మూటకట్టుకున్నామంటూ అనుచరగణం ఎదుట బోరుమంటున్నారు.

- ఫిరాయింపుదారుల్ని కరివేపాకులా చూసిన చంద్రబాబు
- డబ్బుకు ఆశపడి నాడు విలువలున్న పార్టీని వీడిన ఎమ్మెల్యేలు
- పాడేరు సీటు ఆశించిన గిడ్డి ఈశ్వరికి మొండిచెయ్యి
- రంపచోడవరం టికెట్ కోసం భంగపడ్డ వంతల రాజేశ్వరి
- కిడారి శ్రవణ్‌ని వంచించిన చంద్రబాబు
- రాజకీయ భవిష్యత్తు నాశనం చేశారంటూ వాపోతున్న ఫిరాయింపుదారులు
- తదుపరి కార్యాచరణ కోసం అనుచరులతో మంతనాలు
- చంద్రబాబు ఇంటి ముందే ఆందోళన చేసిన వంతల అనుచరులు

సాక్షి, విశాఖపట్నం : ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కేస్తూ.. గెలిపించిన ప్రజల నమ్మకాన్ని.. ఆదరించిన పార్టీ విశ్వాసాన్ని అమ్ముకున్న ప్రజా ప్రతినిధులు.. ఇప్పుడు బేల చూపులు చూస్తున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని సంతలో పశువుల్లా ఎమ్మెల్యేల్ని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కొనేశారు. ఒడ్డు దాటే వరకే ఓడ మల్లన్న.. ఆ తర్వాత బోడి మల్లన్న అనే సూత్రాన్ని ప్రతిసారీ తూచ తప్పకుండా పాటించే నాయకుడు చంద్రబాబే అన్న విషయం జగమెరిగిన సత్యం. అది తెలిసి కూడా.. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలు తల్లిలా ఆదరించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వదిలేసి.. టీడీపీ కండువా కప్పేసుకున్నారు. ఇప్పుడా టీడీపీ.. టికెట్ ఇవ్వకుండా బలి పశువుల్ని చేయడంతో రోడ్డున పడ్డారు. ఫిరాయింపుదారుల రాజకీయ పరిస్థితి గాల్లో దీపాల్లా మారిపోయాయి.

'కిడారి' సీటుకు కిరికిరి..!

రూ.కోట్లు.. మైనింగ్ లైసెన్సుల ఆశ చూపి.. మరో గిరిజన ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావుని సైతం ఫిరాయింపు ఎమ్మెల్యేగా ముద్రవేసేశారు చంద్రబాబు. 2014లో వైఎస్ జగన్ నమ్మి అరకు టికెట్‌ని ఇస్తే.. వైఎస్సార్‌సీపీ దయతో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే.. బాక్సైట్ మైనింగ్ లైసెన్సుల కోసం ఆశపడుతున్నట్లు గ్రహించిన టీడీపీ.. కిడారికి.. అదే ఎర వేసేసింది. రూ.12 కోట్లు.. మైనింగ్ లైసెన్స్ ఇస్తామని లోకేష్ చెప్పడంతో.. జంప్ అయ్యారు. ఈ విషయాలన్నీ.. మావోయిస్టుల ఎదురుగా.. స్వయంగా కిడారి చెప్పినట్లు ప్రత్యక్ష సాక్షులు అప్పట్లో చెప్పడం కలకలం రేపాయి. మావోయిస్టుల చేతిలో కిడారి సర్వేశ్వరరావు హత్యకు గురైన తర్వాత.. ఆయన కుమారుడు కిడారి శ్రావణ్ కుమార్‌ని ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా కనీసం అవకాశం ఇవ్వకుండానే ఆగమేఘాలపై చంద్రబాబు తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. సరిగ్గా ఆరు నెలల తర్వాత లోకేష్ కోసం మంత్రి పదవుల సర్దుబాటులో భాగంగా కిడారి శ్రావణ్‌తో మంత్రి పదవికి చంద్రబాబు రాజీనామా చేయించేశారు. ఆ తర్వాత 2019లో టీడీపీ తరఫున పోటీ చేసినా.. పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా, పార్లమెంటరీ పార్టీ ఇన్‌చార్జిగా ఐదేళ్లుగా టీడీపీని అరకులో నిలబెట్టారు. అలాంటి కిడారిని కూడా కరివేపాకులా తీసిపారేయడంతో ఈ యువనాయకుడికి దిక్కుతోచని పరిస్థితి. అధినేతతో మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వకపోవడంతో భవిష్యత్తు కార్యాచరణపై అనుచరులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

నైరాశ్యంలో 'వంతల'

గిడ్డి, కిడారి బాటలో చంద్రబాబుని నమ్మి మోసపోయిన జాబితాలో వంతల రాజేశ్వరి కూడా చేరారు. రంపచోడవరం నియోజకవర్గం నుంచి 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున విజయం సాధించారు. టీడీపీ ఆకర్ష్‌లో భాగంగా.. తాను పార్టీ మారితే రూ.20 కోట్లు ఇస్తామని ఆఫర్ చేశారంటూ 2016 మార్చిలో సంచలన వ్యాఖ్యలను బహిరంగంగా చేసిన వంతల.. ఏడాది కాలంలోనే వైఎస్సార్‌సీపీని వీడి.. డబ్బు ఆశ చూపిన పచ్చ కండువానే కప్పుకున్నారు. చట్టసభలకు పంపించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే చివరి వరకూ నా రాజకీయ ప్రయాణమని చెప్పి.. ప్రలోభాల ఎరలో చిక్కుకొని టీడీపీలోకి జంప్ అయ్యారు. 2019లో టీడీపీ తరఫున పోటీ చేసినా.. ప్రజల నమ్మకాన్ని కోల్పోయిన వంతలను ఇంటిలోనే కూర్చోబెట్టారు. ఆ తర్వాత నియోజకవర్గంలో టీడీపీని బతికించేందుకు వ్యయప్రయాసలతో ఐదేళ్లు పనిచేసినా.. చంద్రబాబు గుర్తించకుండా.. వంతల సేవలకు స్వస్తి చెప్పారు. టికెట్ రాకపోవడంతో రాజేశ్వరి నైరాశ్యంలో కూరుకుపోయారు. పార్టీ కోసం సేవచేసినా.. మిరియాల శిరీషకు టికెట్ రావడంతో చంద్రబాబు తనకు కూడా వెన్నుపోటు పొడిచేశారంటూ సన్నిహితుల వద్ద కన్నీటి పర్యంతమయ్యారు.

ఇప్పుడైనా సరైన నిర్ణయం తీసుకోకుంటే..

ముగ్గురు ఫిరాయింపుదారులకూ టీడీపీ చెక్ పెట్టింది. వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచిన వారందరికీ.. చంద్రబాబు మళ్లీ వెన్నుపోటు పొడిచారంటూ ప్రజలే మాట్లాడుకోవడం విశేషం. రాజకీయాల్లో ఉన్న వారు.. పదవులు కోల్పోయినా.. ఇప్పుడు కాకపోతే మరోసారైనా విజయం దక్కించుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే.. సానుభూతిని.. ప్రజలలో విశ్వాసాన్ని మాత్రం కోల్పోకుండా చూసుకోవాలి. ఈ విషయంలో మాత్రం వైఎస్సార్‌సీపీని కాదని టీడీపీకి వెళ్లిన ఫిరాయింపు ఎమ్మెల్యేలు చంద్రబాబుని నమ్మి పూర్తిగా నష్టపోవడంతో పాటు ప్రజల్లో విశ్వాసాన్ని కూడా కోల్పోయారు. ఈ ఎన్నికల్లో సరైన నిర్ణయాన్ని తీసుకోకపోతే వీరి రాజకీయ భవిష్యత్తుకు చరమగీతం పాడినట్లే అవుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

పాలుపోని ఈశ్వరి..

2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి.. ఎమ్మెల్యేగా విజయం సాధించిన గిడ్డి ఈశ్వరి.. తర్వాత చంద్రబాబు మాయమాటలతో పార్టీ ఫిరాయించేశారు. రూ.5 కోట్ల డీల్ తోపాటు మంత్రి పదవి ఇస్తానని చెప్పి.. చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించడంతో.. అన్నలా ఆదరించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కాదని.. నయవంచకుడి పంచన చేరి.. 2018లో పచ్చ కండువా కప్పుకున్నారు. అప్పటి నుంచి గిడ్డికి అన్నీ కష్టాలే ఎదురయ్యాయి. టీడీపీలో సరైన ప్రాధాన్యమివ్వడం తగ్గించేశారు. 2019 టీడీపీ నుంచి కష్టపడి టికెట్ సాధించి పోటీలో నిలిచారు. వైఎస్సార్‌సీపీకి అన్యాయం చేసిన గిడ్డి ఈశ్వరిపై విశ్వాసం కోల్పోయిన ప్రజలు.. ఆమెని ఇంటికే పరిమితం చేశారు. ఇప్పుడు చంద్రబాబు కూడా ఈశ్వరిని పొమ్మనకుండా పొగపెట్టే ప్రయత్నాలు చేస్తూ.. పొత్తుల్లో భాగంగా టికెట్‌ని బీజేపీకి కట్టబెట్టేశారు. దీంతో.. గిడ్డి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తన గోడు వినిపించేందుకు వెళ్దామని అనుకున్నా.. చంద్రబాబు రానివ్వడం లేదని తెలుస్తోంది. దీంతో.. గిడ్డి అనుచరులు మండిపడుతున్నారు. రెబల్‌గా పోటీ చేయాలని పార్టీ శ్రేణులు చెబుతున్నా.. ఏం చెయ్యాలో పాలుపోక నడిసంద్రంలో నిలిచిపోయినట్లు తన పరిస్థితి ఉందని సన్నిహితుల వద్ద వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- జగనన్న పాలనలోనే గిరిజన ప్రాంతం అభివృద్ధి
- చరిత్రలో నిలిచిపోనున్న వైద్య కళాశాల ఏర్పాటు
- మారుమూల గ్రామాలకు రహదారులు
- మెరుగుపడిన రవాణా వ్యవస్థ
- విద్యార్థులకు నాణ్యమైన బోధన, వసతులు
- పార్టీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ



సాక్షి,పాడేరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అరకు పార్లమెంట్‌తో పాటు జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పిలుపు నిచ్చారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజన ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. మైదాన ప్రాంతాలకు దీటుగా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. నవరత్నాల పథకాలతో పేదలకు ఎంతో మేలు జరిగిందన్నారు. జిల్లా కేంద్రం పాడేరులో రూ.500 కోట్లతో నిర్మిస్తున్న వైద్య కళాశాల చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దీనివల్ల గిరిజనులకు స్థానికంగా కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ విద్యాలయాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన,వసతి సౌకర్యాలు అందుబాటులోకి రావడం శుభ పరిణామమన్నారు. మారుమూల గ్రామాల రోడ్లు అభివృద్ధితో రవాణా వ్యవస్థ మెరుగుపడిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి శ్రీరామ రక్ష అన్నారు. అరకులోయ ఎంపీ, అరకులోయ, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ఆయన పేర్కొన్నారు.

'వంతల'కు తప్పని భంగపాటు



విజయవాడలో చంద్రబాబు నివాసం వద్ద ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు

- చంద్రబాబు నివాసం వద్ద ఆందోళన
- ఆయనను కలవకుండా అడ్డుకున్న పోలీసులు
- రోజంతా పడిగాపులు
- ఎట్టకేలకు సాయంత్రం కలిసిన శ్రేణులు
- ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేశాడని శిరీష భర్త భాస్కర్‌పై బాబుకు ఫిర్యాదు..?

రంపచోడవరం: రంపచోడవరం టీడీపీ టికెట్ విషయంలో చంద్రబాబు నిర్ణయం మార్చుకుంటారని ఎంతో ఆశతో అనుచరులతో విజయవాడ వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి భంగపాటు తప్పలేదు. రంపచోడవరం టీడీపీ అభ్యర్థిగా మిరియాల శిరీషను ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగడం తెలిసిందే. పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని ప్రకటించిన వారు మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 11 మంది టీడీపీ నేతలు శుక్రవారం తెల్లవారుజామున చంద్రబాబును కలిసేందుకు విజయవాడ వెళ్లారు. బాబును కలిసేందుకు ప్రయత్నించిన వారిని పోలీసులు అడ్డుకోవడంతో మధ్యాహ్నం వరకు ఆందోళన చేశారు. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు లేదని వారు ధ్వజమెత్తారు. వీరిలో నలుగురికి చంద్రబాబును కలిసే అవకాశం వచ్చింది. టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవి భర్త మఠం భాస్కర్‌పై వారు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. మూడేళ్ల క్రితం ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.కోటి వరకు నిరుద్యోగుల నుంచి వసూలు చేసినట్టు వారు చంద్రబాబు తెలిపినట్టు సమాచారం. భాస్కర్‌పై పోలీసు కేసులు కూడా ఉన్నాయని రాజవొమ్మంగి ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు చెప్పినట్టు తెలిసింది. ఈ కారణంగా శిరీషకు టికెట్ కేటాయింపు పునరాలోచించాలని వారు కోరినట్టు సమాచారం. సీటు మార్చాలని వారు కోరుతుండగా పట్టించుకోకుండా చంద్రబాబు వెళ్లిపోయినట్టు తెలిసింది.

సమాచార వ్యవస్థ బలోపేతం

- చురుగ్గా సెల్ టవర్ల నిర్మాణం
- గుర్రాలపై మారుమూల ప్రాంతాలకు మెటీరియల్ తరలింపు



అడవి మార్గంలో సామగ్రిని తీసుకువెళ్తున్న గుర్రాలు

సీలేరు: మారుమూల గ్రామాల్లో సమాచార వ్యవస్థను బలోపేతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించింది. దీనిలో భాగంగా దుప్పులవాడ పంచాయతీ జొన్నమామిడికి సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారికి ఆనుకొని మూడు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణానికి కసరత్తు మొదలుపెట్టింది. అక్కడి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో జి.మాడుగుల నుంచి 43 గుర్రాలను రప్పించిన సెల్ కంపెనీ ప్రతినిధులు కంకర, సిమెంటు, ఇసుకను వాటిపై తరలిస్తూ నిర్మాణ పనులను వేగవంతం చేశారు.

తనిఖీలు ముమ్మరం

- ఒడిశా నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘా



ముంచంగిపుట్టులో శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా రాకపోకలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. గత కొన్ని రోజులుగా సరిహద్దు గ్రామాల్లో దొంగలు బీభత్సం సృష్టించడంతో అప్రమత్తమైన పోలీసులు నిఘాను మరింత పటిష్టం చేశారు. ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. అనుమానితుల వివరాలు సేకరించి విడిచిపెడుతున్నారు.ఏఎస్ఐ లక్ష్మణరావు, పోలీసులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై విస్తృత ప్రచారం



ఓటు హక్కు వినియోగంపై పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయసునీత, జేసీ భావన, ధాత్రిరెడ్డి



దివ్యాంగులతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ విజయ సునీత, అధికారులు

సాక్షి,పాడేరు: ఓటు హక్కు వినియోగంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ విజయ సునీత సూచించారు. ఇందుకు సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన పది రకాల ప్రచార పోస్టర్లను శుక్రవారం ఆమె జాయింట్ కలెక్టర్ భావన, సబ్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఎస్‌డీసీలు, స్వీప్ నోడల్ అధికారి వీవీఎస్ శర్మ, భవానీలతో కలిసి ఆవిష్కరించారు. ప్రజలు అవగాహన పొందేలా వీటిని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసు, ప్రధాన జంక్షన్లలో అంటించాలని అధికారులను ఆదేశించారు.

దివ్యాంగులతో అవగాహన ర్యాలీ

రానున్న సార్వత్రిక ఎన్నికలలో దివ్యాంగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం.విజయసునీత పిలుపునిచ్చారు.అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై చైతన్యం కలిగించే లక్ష్యంగా శుక్రవారం దివ్యాంగులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో జేసీ భావన, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, దివ్యాంగుల సంక్షేమశాఖ సంచాలకులు మాధవి, ఎస్‌డబ్ల్యూఈపీ కోఆర్డినేటర్ శర్మ, జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారి రహీం పాల్గొన్నారు.

వరద నుంచి విముక్తి

- రూ.23 కోట్లతో ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- 'సాక్షి' కథనాలకు స్పందన



వరద సమయంలో ముంపునకు గురవుతున్న చట్టిలోని జాతీయ రహదారి (ఫైల్)

చింతూరు: వరదల సమయంలో వినియోగించేందుకు ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించారు. దీనిలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.23 కోట్లతో మండలంలో నాలుగు రహదారులు, వంతెన, కూనవరం, చింతూరు మండలాల మధ్య రహదారిని నిర్మించనున్నారు. గతంలో ప్రత్యామ్నాయ రహదారుల ఆవశ్యకతను తెలియజేస్తూ సాక్షిలో ప్రచురితమైన కథనాలపై స్పందించిన జిల్లా అధికార యంత్రాంగం పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది.



చట్టిలో నిర్మించనున్న ప్రత్యామ్నాయ రహదారి

చేపట్టనున్న నిర్మాణాలివే..

- చింతూరు మండలంలో వరదలు సంభవిస్తే చట్టి, భద్రాచలం జాతీయ రహదారిపై వరదనీరు చేరి ఆంధ్రా నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌తో పాటు కూనవరం, ఎటపాక మండలాలు, చింతూరు మండలంలోని సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం చట్టి నుంచి సింగన్నగూడెం జాతీయ రహదారి వరకు ఉన్న 2.6 కిలోమీటర్ల గ్రావెల్ రహదారిని రూ 2.25 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో బీటీ రహదారిగా నిర్మించనున్నారు. పనులు పూర్తయితే మండలంలోని ఇతర గ్రామాలతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వెళ్లే వెసులుబాటు కలుగుతుంది. వరద ప్రభావిత ప్రాంతాలకు సహాయక చర్యల నిమిత్తం సరకుల రవాణాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.
- చింతూరు మండలంలో చూటూరు నుంచి వేగితోట వరకు రూ 1.95 కోట్లతో 2.8 కిలోమీటర్లు, బండారుగూడెం నుంచి కారంగూడెం వరకు రూ.90 లక్షలతో 950 మీటర్ల మేర ప్రత్యామ్నాయ రహదారులకు కూడా నిధులు మంజూరయ్యాయి. అలాగే చింతూరు మండలం ఏడురాళ్లపల్లి, కూనవరం మండలం బోదునూరు మధ్య రూ.6.98 కోట్లతో 11.5 కిలోమీటర్ల మేర ప్రత్యామ్నాయ రహదారి కూడా మంజూరైంది.

సోకిలేరు వాగుపై బ్రిడ్జి

వరదల సమయంలో వీఆర్‌పురం, చింతూరు మండలాల నడుమ వాగులు పొంగి వరదనీరు రహదారి పైకి చేరి రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రధానంగా చింతూరు మండలంలో సోకిలేరువాగు కారణంగా మండలంలోని సుమారు 15 గ్రామాల ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో నాటు పడవలు, లాంచీలపై ఆధారపడాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని చింతూరు మండలం పెదశీతనపల్లి వద్ద సోకిలేరు వాగుపై రూ 2.50 కోట్లతో కొత్త వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోంది. ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణాలతో గిరిజనులకు ఎంతోమేలు జరుగుతుంది. వరదల సమయంలో పడుతున్న ఇబ్బందులు తొలగుతాయి.

– చిచ్చుడి మురళి, ఎస్టీ కమిషన్ సభ్యుడు

డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారికి పదోన్నతి

గొలుగొండ: కృష్ణదేవిపేట డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి రాజేష్ శుక్రవారం పదోన్నతిపై బదిలీ అయ్యారు. రెండు సంవత్సరాల క్రితం కృష్ణదేవిపేట రేంజ్ పరిధిలో డీఆర్‌వోగా చేరి విధులు నిర్వహించారు. కలప అక్రమ రవాణా అడ్డుకోవడంతోపాటు అడవుల పరిరక్షణకు విశేష కృషి చేశారు. తాజాగా ఆయనకు రాష్ట్ర అటవీ శాఖ పదోన్నతి ఇవ్వడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు అటవీ రేంజ్ అధికారిగా బదిలీ అయ్యారు.

400 మందికి వైద్య పరీక్షలు


సమావేశంలో మాట్లాడుతున్న కమాండెంట్ సెంథిల్ కుమార్

సీలేరు: సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ ఆద్వర్యంలో దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ గ్రామంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్ ద్వారా శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సెకెండ్ ఇన్ కమాండెంట్ సెంథిల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో గిరిజనులు ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో సీఆర్‌పీఎఫ్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తుందన్నారు. మంచి మార్గంలో నడుచుకోవాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు.క్రీడా యువకులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు.ఏపీ జెన్‌కో ఇండోర్ స్టేడియంలో షటిల్ క్రీడలను ప్రారంభించారు. ఈ నెల 20 వ తేది వరకు పోటీలు జరుగుతాయన్నారు.400 మందికి భోజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సీఆర్‌పీఎఫ్ వైద్యాధికారు నితిన్ జెల్డీ, సీలేరు పీహెచ్‌సి వైద్యాధికారి సౌమ్య, ఇన్‌స్పెక్టర్ సుజేన్ కేడి, రామకృష్ణ, సుందరం, పాండే తదితరులు పాల్గొన్నారు.

'బండారు' చెంత అసంతృప్తుల చింత..!

- టికెట్ రాకపోవడంతో ఇంకా మౌనముద్రలోనే సత్యనారాయణమూర్తి
- ఉమ్మడి విశాఖలో టికెట్ రాని తెలుగు తమ్ముళ్లంతా బండారు ఇంటికి..
- భవిష్యత్తు కార్యాచరణపై చర్చించిన నేతలు
- చంద్రబాబు వైఖరిపై గుర్రుగా ఉన్న సీనియర్లు
- పార్టీ టికెట్ ఇవ్వకపోవడంపై రగిలిపోతున్న కేడర్



విశాఖ సిటీ: జిల్లా తెలుగుదేశంలో అసంతృప్తి జ్వాలలు రగులుతున్నాయి. అధినేత చంద్రబాబుపై తెలుగు తమ్ముళ్లు కారాలు మిరియాలు నూరుతున్నారు. కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన వారిని పక్కన పెట్టి.. ఆర్థిక పరిపుష్టి ఉన్న వారికే టికెట్లు ఇవ్వడంపై సీనియర్లు తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ రెండో జాబితా ప్రకటించిన తరువాత జిల్లా టీడీపీలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. నిన్న మొన్నటి వరకు అధినేతపై ఈగ వాలనీయని నేతలు జాబితాలో చోటు దక్కకపోవడంతో.. వారంతా చంద్రబాబుపై దుమ్మెత్తి పోస్తున్నారు. అసంతృప్తి నేతలంతా ఒక చోట చేరడం ఇపుడు టీడీపీలో హాట్ టాపిక్‌గా మారింది.

బండారుకు బుజ్జగింపులు

పెందుర్తి టికెట్‌ను తెలుగుదేశం పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించింది. ఈ స్థానం నుంచి జనసేన అభ్యర్థిగా పంచకర్ల రమేష్‌బాబు ఎన్నికల బరిలో దిగనున్నారు. దీంతో మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడిన తనను పక్కనపెట్టడంపై జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదిలా ఉంటే బండారుకు, జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు గత కొద్ది కాలంగా పొసగడం లేదు. పంచకర్లకు టికెట్ ఇస్తే తాను సహకరించనని గతంలోనే టీడీపీ అధినాయకత్వానికి తేల్చి చెప్పారు. పెందుర్తి టికెట్ కోసం బండారు చివరి నిమిషం వరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. అయితే ఆ స్థానాన్ని జనసేనకు కేటాయించినప్పటికీ బండారుకు ప్రత్యామ్నాయం చూపించకపోవడంపై రగిలిపోతున్నారు. గురువారం రెండో జాబితా ప్రకటించినప్పటి నుంచి బండారు పరవాడలో ఉన్న తన ఇంటి నుంచి అడుగు బయట పెట్టలేదు. జిల్లా నాయకులు ఫోన్ చేసినప్పటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో టీడీపీ జిల్లా పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు.. బండారు ఇంటికి వెళ్లి సర్ది చెప్పే ప్రయత్నం చేసి వెళ్లిపోయారు.

బండారు నివాసానికి అసంతృప్తివాదులు

టికెట్ ఆశించి భంగపడిన టీడీపీ అసంతృప్తివాదులు బండారు నివాసంలో సమావేశమయ్యారు. అనకాపల్లి ఇంచార్జ్ పీలా గోవింద్, చోడవరం ఇంచార్జ్ తాతాయ్యబాబు, మాడుగుల టీడీపీ నేత పీవీజీ కుమార్, ఇతర నాయకులు బుధవారం సాయంత్రం బండారు నివాసానికి వెళ్లి తమ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడిన తమను అధినాయకత్వం పట్టించుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొంతమంది పార్టీ సీనియర్లతో పాటు చంద్రబాబు కూడా ఫోన్లు చేసి బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. జనసేన పార్టీ నేతలతో కలిసి పనిచేయాలని, పార్టీ నిర్ణయించిన, జనసేన నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిసింది. దీనిపై అసంతృప్తి నేతలు మరింత రగిలిపోతున్నారు. పొత్తుల పేరుతో టికెట్లు ఇవ్వకపోగా.. పక్క పార్టీల విజయానికి కష్టపడాలని చెప్పడంపై మండిపడుతున్నారు. వీరిలో కొంత మంది పార్టీ మార్పుపై చర్చించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వీఆర్ పురం: అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతం తుమ్మిలేరు పంచాయతీ పంచాయతీ పరిధిలోని రహదరి మార్గం లేని కొల్లూరు, గొందూరు, కొండేపూడి, తుమ్మిలేరు తదితర గ్రామాల్లో బోట్ ద్వారా ప్రయాణించి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే నిర్వహించారు. కాలినడకను ఆమె ఆయా గ్రామాలకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ లబ్ధిదారుల చెంతకే నేరుగా పథకాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. రానున్న ఎన్నికలలోల వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, సీఐ డి.రామారావు, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీవెంకటేష్, ఏఈలు సాయి, రామకృష్ణారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ సత్తిబాబు, మాజీ కన్వీనర్ గోపాల్, జేసీఎస్ మండల ఇంచార్జ్ సత్యనారాయణ, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ గంగులు, ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, సర్పంచులు రామారావు, బాలరాజు, నాయకులు కాంతారావు నరేష్, బాలాజీ, ఉమామహేశ్వరరావు, రమణారెడ్డి,ముత్యాలరావు,ముత్యాల గౌతమ్, ముత్యాల జయరాజ్,బంధం రాజు,సూర్యప్రకాశరావు, లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డీఎల్‌పీవో పర్యటన


మాట్లాడుతున్న డీఎల్‌పీవో రాఘువన్

దేవీపట్నం: పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది దృష్టి పెట్టాలని రంపచోడవరం డీఎల్‌పీవో రాఘువన్ అన్నారు. మండలంలోని పూడిపల్లి, శరభవరం, ఇందుకూరుపేట గ్రామాల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఆయా పంచాయతీ కార్యాలయాలను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మంచినీటి ట్యాంకుల క్లీనింగ్, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు.

ఇంటి పన్నులు నూరు శాతం పూర్తి చేసిన పంచాయతీలను అభినందించారు. ఇంటి పన్నుల బకాయిలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షకు ప్రత్యేక ఏర్పాట్లు

- జిల్లావ్యాప్తంగా 35 కేంద్రాలు
- హాజరుకానున్న 19,664 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లపై సమీక్షించిన జేసీ మయూర్ అశోక్


మాట్లాడుతున్న జేసీ అశోక్

విశాఖ విద్య: జిల్లాలో ఆదివారం జరిగే గ్రూప్ -1 స్క్రీనింగ్ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. పరీక్ష నిర్వహణ, ఇతర ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్ వీసీ హాలులో చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందని, 19,664 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని, సంబంధిత ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. పేపర్-1 పరీక్ష ఉదయం 10గంటల నుంచి 12 వరకు, పేపర్-2 మధ్యాహ్నం 2గంటల నుంచి 4 వరకు రెండు దఫాలుగా జరుగుతుందన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులు, అభ్యర్థుల సౌకర్యం దృష్ట్యా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. 0891 - 2590100, 0891 - 2590102 నంబర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష జరిగే రోజు ఉదయం 7 గంటలకు కలెక్టరేట్ స్ట్రాంగ్ రూంకు వచ్చి రెండు పూటలకు సంబంధించిన పరీక్షా పత్రాలను తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ప్రతీ పరీక్షా కేంద్రంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్ పేర్కొన్నారు.

ఎస్టీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించడమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్ నాయక్

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ వెల్లడి

అనకాపల్లి: ఎస్టీ వసతిగృహాలకు సొంత భవనాల నిర్మాణమే లక్ష్యంగా ఎస్టీ కమిషన్ పని చేస్తుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్ నాయక్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు ప్రైవేటు హోటల్లో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో నాలుగు ఎస్టీ వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, సొంత భవనాలు సమకూర్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం రూ.20 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. జిల్లాలో మాడుగుల, చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో పర్యటించామని, ఆయా ప్రాంతాల గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించామన్నారు. మాడుగులలో ఇంటర్, పీజీ, డిగ్రీ విద్యనభ్యసించే గిరి విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. రావికమతం మండలం చలిసింగం గ్రామానికి రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ప్రతి గిరిజన గ్రామంలో శ్మశానవాటిక ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఎస్టీ కులస్తులకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో మెడికల్ కళాశాలల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. నాడు-నేడు పనుల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి పర్చడంతో గిరిజన విద్యార్థులు విద్యకు దగ్గరవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంఘాల నేతలు టి.పూర్ణారావు, మధుకుమార్, భానుచందర్, వరహాలదొర, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగశిరీష, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అజయ్‌బాబు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ విజయ సునీత ఆదేశం
- 75 వినతుల స్వీకరణ

సాక్షి,పాడేరు: స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై స్వీకరించిన వినతుల పరిష్కారానికి అధికారులంతా ప్రత్యేకశ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎం.వి జయసునీత ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి వివిధ సమస్యలపై కలెక్టర్‌తో పాటు జేసీ భావన, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, డీఆర్వో పద్మావతి 75 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. స్పందనలో స్వీకరించిన వినతులను సంభందిత శాఖల అధికారులంతా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన నాటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో పక్కాగా అమలుజేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు ఇంజనీరింగ్‌శాఖల ఈఈలు డీవీఆర్‌ఎం.రాజు, కొండయ్యపడాల్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, ఎస్‌డీసీ వీవీఎస్ శర్మ, ఐటీడీఏ ఏవో హేమలత, పశుసంవర్ధకశాఖ జేడీ నరసింహులు, డీఎల్పీవో కుమార్,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- పాడేరు మండలం మినుములూరు పంచాయతీ పరిధిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తీగలకు మరమ్మతులు చేపట్టాలని, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సర్పంచ్ లంకెల చిట్టెమ్మ కోరారు.
- 12వ మైలురాయి గ్రామం వరకు రోడ్డు నిర్మించాలని పాడేరు మండలం వంట్లమామిడి పంచాయతీ నందిగరువు గిరిజనులు వినతిపత్రం అందజేశారు.
- హుకుంపేట మండలం కొట్నాపల్లిలో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీతో గ్రామస్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, క్వారీని నిలుపుదల చేయాలని కె.చిట్టిబాబు అధికారులను కోరారు.
- హుకుంపేట మండలం మజ్జివలస నుంచి కొండయ్యపాడు వరకు ఏడు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని బూర్జ ఎంపీటీసీ మజ్జి హరి వినతి పత్రంలో కోరారు.
- చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయతీ పరిధిలో మాడెంబంద నుంచి పాలమామిడి వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలని సీహెచ్.రామారావు కోరారు.

రాత్రింబవళ్లు కష్టపడితే ఇదా ఫలితం?

- అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు
- పవన్ కల్యాణ్‌పై పరుచూరి చిందులు
- పార్టీ పదవులకు రాజీనామా


రాజీనామా పత్రంతో భాస్కరరావు

తుమ్మపాల: ఐదేళ్లుగా రాత్రి పగలు కష్టపడ్డాను.. ఇల్లు, వాకిలి, పెళ్లాం పిల్లల్ని వదిలి పార్టీ కోసం తిరిగాను.. పవన్ కల్యాణ్ కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు.. పొత్తు పేరిట పార్టీలోకి కొత్తగా వచ్చిన కొణతాలకు టికెట్ ఇచ్చారు.. నా కష్టానికి ఇదా ఫలితం అని పరుచూరి భాస్కరరావు తీవ్ర ఆవేదన చెందారు. జనసేన పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవులకు రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. పట్టణంలో జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీకి సైనికుల్లా పనిచేశామని, విజయవాడలో 16 రోజులపాటు వేచి ఉన్నా పార్టీ అధినేత పవన్ కల్యాణ్ కనీసం మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదన్నారు. అవమానపడుతూ పార్టీలో ఉండలేనన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేనకు దక్కిన నాలుగు సీట్లలో మూడు సీట్లు ఇటీవల వచ్చిన కొత్త వారికి ఇచ్చారని, కానీ ఐదేళ్లుగా కష్టపడిన తమకు మాత్రం కనీసం ఐదు నిమిషాలు మాట్లాడే అవకాశం ఇవ్వలేదన్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా చెప్పుకునేందుకు ఎల్లవేళల తామున్నామని, కానీ తమకు కష్టం వస్తే చెప్పుకునేందుకు పార్టీ అధిష్టానంలో ఎవరూ లేరన్నారు. ఇక నుంచి పార్టీకి దూరంగా ఉండనున్నట్లు తెలిపారు.

టీడీపీకి సహకరించం

చోడవరం: చోడవరం ఎమ్మెల్యే టికెట్ తెలుగుదేశం పార్టీకి ఇవ్వడంపై జనసేన కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమన్వయకర్త పీవీఎస్ఎన్‌రాజు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో శుక్రవారం అత్యవసర సమావేశం జరిగింది. ఐదేళ్లుగా ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ అనేక ఉద్యమాలు చేశామని, తమకు కాకుండా టీడీపీకి ఎలా కేటాయిస్తారని సమావేశంలో తీవ్రంగా చర్చించారు. పవన్ కల్యాణ్ నిర్ణయం మార్చుకోకపోతే టీడీపీ అభ్యర్థికి పనిచేయడానికి జనసేన క్యాడర్ సిద్ధంగా ఉండరని స్పష్టం చేశారు.

ఇద్దరు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- 30 కిలోలు పట్టివేత
- రూ.1.50 లక్షలు, కారు స్వాధీనం
- జోలాపుట్టు జంక్షన్ వద్ద ఘటన


పట్టుకున్న గంజాయి, నిందితులతో సీఐ రమేష్, ఎస్ఐ రవీంద్ర, పోలీసులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు జంక్షన్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం అక్రమంగా తరలిస్తున్న 30 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగించిన కారును, రూ.1.50 లక్షలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. జి.మాడుగుల సీఐ రమేష్ వివరాల ప్రకారం... గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారని పక్కా సమాచారం రావడంతో ఏవోబీ సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు జంక్షన్ వద్ద మధ్యాహ్నం పోలీసులు తనిఖీలు చేశారు. ఈ క్రమంలో ఒడిశా నుంచి ఆంధ్ర వైపు వస్తున్న కారు వారిని చూసి నిలుపుద చేసి ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా పట్టుకున్నారు. కారును తనిఖీ చేయగా రెండు బ్యాగుల్లో గంజాయిని గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి, గంజాయిని, కారును సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.60 వేలు ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన వారిలో ముంచంగిపుట్టు మండలం పనసపుట్టు పంచాయతీ గిద్దులపుట్టు గ్రామానికి చెందిన జనం కృష్ణ, ఒడిశా రాష్ట్రం చిత్రకొండ బ్లాక్ పనసపుట్టు పంచాయతీ సింగోయి గ్రామానికి చెందిన రూబెన్ ఖరాలుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ తనిఖీలో ముంచంగిపుట్టు ఎస్ఐ రవీంద్ర, ఏఎస్ఐ లక్ష్మయ్య, పోలీసులు, హోంగార్డులు సతీష్, కె.ఆర్.కె పడాల్ పాల్గొన్నారు. గంజాయి సాగు, రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్ హెచ్చరించారు.